# మనుగడలో మమతలు

ఏనాడో కట్టుకొన్న చిన్న ఇంటి వాకిట, పెంచుకున్న రెండు కొబ్బరి చెట్ల నీడలో తీరికగా వార్తాపత్రిక పట్టుకుంటాడు గోపాలం. కాఫీ కప్పు వేడిగా అందించి, ఏదో కూనిరాగం తీస్తూ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటుంది కోమలి. ఆ పాట చాలా శ్రావ్యంగా ఉంటుంది. గోపాలం చెవి ఆ పాట మీదకు పోతుంది. కానీ, ఒక చరణం లోని మాటలు ఇంకో చరణంలోని మాటలతో కలగలిసిపోతాయి. “పాటకి భావం, మాటకి అర్థం ఉండొద్దూ ?” అంటాడు కాసింత విసుగ్గా. “ఆ ... పోనిద్దురూ ........ ఏదో నా మనసు బావున్నప్పుడు సరదాగా పాడే పాటకు అంత నిశిత పరీక్ష పనికిరాదు. నేనేం చదువుకున్నాను గనక...” అంటూ కొంటెగా నవ్వుతుంది కోమలి.

పిల్లలకు రెక్కలొచ్చేదాకా చాలీచాలనీ జీతాలతో జీవనయాత్ర పరుగుపందెంలా సాగిపోయింది. హడావిడిగా మేతమేసి చీకటి పడకుండా అడవిలోంచి బయటపడే గోవుల్లాగ గడచిన జీవితానుభవాల్ని స్థిమితంగా నెమరేసుకొంటూ నిరామయంగా వానప్రస్థాన్ని కొనసాగిస్తున్నారు ఇద్దరూ. ఎదురింటి వారి మనవరాలు భారతి వచ్చి, సందేహాలతో, యక్షప్రశ్నలతో అప్పుడప్పుడు ఆ ఇంట చిన్నపిల్లలు లేరన్న లోటు తీరుస్తూ ఉంటుంది.

గేటు తలుపు తీసిన చప్పుడైంది. హడావిడిగా వచ్చిన భారతి "ఇవాళ మా కాలేజీ డే. నేనూ నాటకంలో ఉన్నాను. మీరూ, మామా రావాలి" అంది గోముగా.

"నాకు ఓపిక లేదు సుమా. వస్తే మామనే తీసుకుపో .... " అంది కోమలి నిర్లిప్తంగా.

"మా నాన్నగారు ఊళ్ళో లేరు. మా నాయనమ్మ రాలేనంటుంది. తాతకేమో మోకాళ్ళనొప్పులు .........." అంటూ నిరాశగా బుంగమూతి పెట్టుకు వెళ్ళిపోతోంది.

"మన ఇంట్లో కూతురో, మనవరాలో ఉంటే అలా అడిగినప్పుడు వెళ్ళమా? పాపం తల్లిని పోగొట్టుకు పెరిగిన పిల్ల" అని అనునయించాడు గోపాలం. "సరేలే వస్తున్నాం........." అని కోమలి మెత్తబడింది.

అదేరోజు ఎండ తీవ్రత తగ్గిన వేళ దంపతులిద్దరూ భారతితో వెళ్ళి వివేకానంద కాలనీ బస్సు షెల్టర్‌లో బెంచీల మీద బస్సుకోసం కూర్చున్నారు. అప్పుడే ఠాకూర్ హరిప్రసాద్ స్కూలు విడిచినట్టున్నారు. ఒక తల్లి పిల్లవాణ్ణి నెమ్మదిగా నడిపించుకొంటూ వచ్చింది. ఆమెను అనుకొని వస్తున్న పిల్లవాడు నోరుతెరచి, పెదవుల కొసల నుండి చొంగకారుస్తూ, చిత్రంగా చూస్తున్నాడు. చీర కొంగుతో చొంగను తుడిచి, వాడి వెన్నుమీద ప్రేమగా చెయ్యివేసి బెంచీమీద కూర్చోబెట్టింది. ఆ తల్లి మొహంలో ఏదో దైన్యం. ఇంతలో వాళ్ళ బస్సే ముందుగా రావడంతో ఇద్దరూ వెళ్ళిపోయారు. అక్కడ గలగలా మాట్లాడుకొంటున్న అరడజను మంది ఆ కాసింత సేపూ బరువైన ఆలోచనలతో నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఆ తర్వాత భారతే తొలి ప్రశ్న సంధించింది.

"మామయ్యా ! ఆ బాబు ఎందుకలా ఉన్నాడు ?"

"ఆరోగ్యంగా పెరిగే పిల్లలందరిలోనూ వయసుతోపాటూ ఆలోచించే శక్తి, అర్థం చేసుకొనే శక్తీ పెరుగుతూ ఉంటుంది. కానీ, ఆ బాబుకి అలా జరగడం లేదు. అందుకని ప్రత్యేకంగా శిక్షణ శ్రద్ధగా ఇచ్చి అందరిలా బ్రతికే అలవాట్లు చెయ్యాలి ......." గోపాలం శాంతంగా వివరించాడు. భారతి సందేహాలు అంత సులభంగా తీరేవి కాదు. అడిగే సభ్యత కూడా తెలియని వయసూ, ఆత్రం ఆమెది.

"ఏమీ నీ కోరిక అని పాతాళభైరవి ఆ తల్లిని అడిగితే - ఈ బాబుని తీసుకొని పోయి మంచి బాబునియ్యమంటుంది కదూ ?" అమాయకంగా మరో ప్రశ్న వేసింది. శాంతంగా ఆ ప్రశ్నకు ఎలా సమాధానం చెప్పాలా అని గోపాలం పెదవికదిపేలోగా అనూహ్యంగా కోమలి నోరు విప్పింది.

"కనిపెంచి అంతవాణ్ణి చేసిన తల్లి ఇంకో బాబుని ఇమ్మని అడగదు. నీ శక్తితో నా పిల్లాణ్ణి అందరిలా ఆరోగ్యంగా మార్చు అని అడుగుతుంది ........"

గోపాలాన్ని ఈ మాటలు ఆశ్చర్యంలో ముంచేశాయి. కోమలి కళ్ళల్లోకి చూశాడు. "ఎందుకలా వింతగా చూస్తున్నారూ ?" అని కోమలి ప్రశ్నించింది.

"ఏమని చెప్పను. నీ మాటలు అక్షరాలా నిజం సుమా. వస్తువుని మార్చుకోగలిగినంత సులభంగా మార్చుకోలేనిదే ప్రేమ. మా తమ్ముడు చిన్నతనంలో ఒక కుక్కపిల్లను పెంచి ఎంతో అనుబంధం పెంచేసుకున్నాడు. దాన్ని కాస్త పెద్దదయ్యాక ఎవరో ఎత్తుకుపోయారు. ఇక వాడు తిండీ నిద్రా మాని మంచం పట్టేశాడు. 'ఇంకో మంచి కుక్కపిల్లను తెస్తాగా' అంటూ మా నాన్నగారు ఎంతో ఊరడించబోయారు. 'నాకు మన టామీయే కావాలి' అని మారాం చేశాడు. అదృష్టవశాత్తూ ఆ కుక్క కట్టు తెంపుకొని తప్పించుకుని తిరిగి వచ్చేసింది, కాబట్టి మా సమస్య తీరింది".

ఈ మాటల వెనక ఉన్న ఆలోచనలు భారతి లాంటి చిన్నపిల్లకర్థమైనా, కాకపోయినా వాళ్ళ బస్సు రావడంతో అంతా వెళ్ళి కూర్చున్నారు.

❋ ❋ ❋

అలా జీవితానికీ, మమతకూ, మానవ సంబంధాలకీ భాష్యం చెప్పుకొంటూ ప్రశాంతంగా సాగుతున్న జీవనయాత్రను ఒక చిన్న కేన్సర్ కణం ఊహించని మలుపు తిప్పేసింది. అది కోమలి రొమ్ములో చేరింది. చిన్న కొడుకు ఢిల్లీలోనే ఉన్నాడు. అక్కడ చికిత్స చేయిస్తే మంచిదికదా అన్నారు ఇరుగుపొరుగువాళ్ళు. గోపాలానికి ఏమీ తోచలేదు.

"నాకు ఇంగ్లీషు రాదు. అప్పుడప్పుడు మీరు పాడే హిందీ పాటలు వినడం

తప్ప ఆ భాష కూడా అర్థం కాదు. నాలుగు మాటలైనా తెలుగురాని పంజాబీ పిల్ల మన కోడలు. ఇలా మీతో మాట్లాడుతూ ఉండగా నేనేమైనా ఫరవాలేదు'' అంది విరాగినిలా కోమలి. కానీ తల్లిని చూడవచ్చిన కొడుకు మాట కాదనలేకపోయారు ఇద్దరూ.

కొడుకూ, కోడలూ ఉంటున్న నివాసం ఢిల్లీకి ఉత్తరాన ముఖర్జీనగర్‌లో ఉంది. ఇద్దరి కార్యాలయాలూ, డ్యూటీవేళలూ వేరు. అయినా, వంతులవారీగా కోమలిని ఆసుపత్రికి తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయించారు. కీమోథెరపీ చికిత్స ఫిమేల్ వార్డులో జరిపించారు. గుర్తించలేని ఆ రహదార్లలో కనీసం స్కూటరయినా నడపడం రాని గోపాలం అలాటి సమయంలో వాళ్ళకి ఏ విధంగానూ సహాయపడలేకపోయినా, ఆ ఇంట్లోనే ఉండి, కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ, వచ్చిన ఫోన్‌కాల్స్ అందుకొని జవాబు చెప్తూ, స్కూలు నుండి వచ్చేసిన మనవణ్ణి చూసుకొంటూ ఆలస్యంగా ఆసుపత్రి నుండి తీసుకువచ్చిన కోమలికి ఉపశాంతి వచనాలు అందిస్తూ గడిపేశాడు. సాధారణంగా జరిపే పరీక్షలన్నింటిలోనూ - కోమలి శరీరంలో కేన్సర్ కనపడలేదని రిపోర్టు వచ్చిన రోజున గోపాలం నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు. అయితే, కోమలి బరువు తగ్గితేనే కానీ గుండెమీద ఒత్తిడీ, ఆయాసం అదుపులోకి రావనీ, కాసింత దూరమైనా రోజూ నడుస్తూ వుండాలనీ డాక్టర్లు సలహా ఇచ్చారు.

ముఖర్జీనగర్ కాలనీ వీధుల్లో దంపతులు మెల్లగా మాట్లాడుకొంటూ ఉదయం, సాయంత్రం నడిచే వేళ కాసింత పరిచయం కలిగిన వాళ్ళు ఎదురుపడి ఆరోగ్యం గురించి ప్రశ్నించడం, ఏ పరిచయమూ లేని వాళ్ళు కోమలి శరీరంలో కెమోథెరపీ కారణంగా వచ్చిపడ్డ మార్పులకు వింత చూపులు చూడ్డం జరిగేది.

ఒక ఉదయం స్నానం చేసి తలమీద మిగిలిన జుట్టును, వేళ్ళతో తడుముకొంటూ ''ఇవాళ నుండీ నే ఒక్కర్తినే నడుస్తాను. మీరు రావద్దు'' అంది కోమలి.

అలిగిందేమో అనుకున్న గోపాలం ''ఎందుకూ ?'' అని ఆశ్చర్యంగా చూశాడు. ''అంతా దారిలో నా వేపు వింతగా చూస్తూ వుంటే నాతో చీమనడక నడుస్తున్న మీకు

ఎంత ఇబ్బందో తల్చుకొంటే నాకు బాధగా ఉంటుంది". ఈ కారణం వింటూ చిన్నగా నవ్వాడు.

"ఈ వయసులో మనం ఇంకొకరి చూపుకీ, మాటకీ బాధపడాలంటావా ? నువ్వు ఒక్కతెవే నడుస్తూ వుంటే ఇంట్లోనే ధైర్యంగా ఉండగలనా ? నీ జుట్టు ఎప్పటిలాగే వచ్చేస్తుందని డాక్టర్లు చెప్పేరు కదా. రాకపోతే మాత్రం మనకొచ్చిన నష్టమేమిటి ?" అని ఓదార్పుగా అన్నాడు.

కోమలి కళ్ళు పెద్దవి చేసి - 'నిజమా' అన్నట్టు చూసింది. ఆ చూపులో ఏదో మెరపు. ఎంతో తృప్తి.

"అయితే పదండి నడుస్తూ మాట్లాడుకుందాం" అన్న కోమలిని చూడగానే ఏదో చెప్పాలని ఉత్సాహపడుతున్నట్లు గ్రహించాడు. చెట్లనీడలో నడుస్తూ తన మనసులోని కోరిక బయటపెట్టింది.

"మనం వీళ్ళని ఇబ్బంది పెట్టటమే తప్ప ఏ సాయం చెయ్యలేము. మన ఊరు వెళ్ళిపోదాం. ఇలా మాట్లాడుకొంటూ వుంటే ఈ ప్రాణం ఎప్పుడు పోయినా సంతోషమే ....."

'అలాగే' అని గోపాలం భరోసా ఇచ్చాక, ఇద్దరూ ఇంటిదారి పట్టారు.

❊ ❊ ❊

ఆ మరునాడే వేకువజామున పక్కమీంచి లేచి నిలబడబోయిన కోమలి మంచుముద్దలా నేలమీద కుప్పకూలిపోయింది. నిలబడే మాట అటుంచి తనంత తానుగా కూర్చోలేక వెల్లకిలా పడుకుంది. మాటలు నీరసంగా ఉన్నా, స్పష్టత కోల్పోలేదు. ఈ పరిణామానికి దంపతులు క్రుంగిపోయారు.

"ఇవాళ ఇంట్లో మీ మనవణ్ణి చూస్తూ కూర్చోండి, అమ్మని ఆసుపత్రికి తీసుకువెళ్ళి చేరుస్తాం" అని రఘూ, భార్యా కారులో వెళ్ళిపోయారు. కోమలిని కారులో ఎక్కించడంలో తోడ్పడ్డం తప్ప ఏం చెయ్యాలో పాలుపోక కారు కనుమరుగయ్యే దాకా చూస్తూ నిలుచుండిపోయాడు గోపాలం.

ఉద్యోగాల ఒత్తిడిలో, ఉన్న ఒక్క కారునూ అవసరానికి తగ్గట్టు పంచుకొంటూ ఆఫీసుకు వెళ్తున్నప్పుడో, తిరిగి వస్తున్నప్పుడో కొడుకూ, కోడలూ కోమలిని చూసి వస్తున్నారే కానీ, గోపాలం మనసులోని ఆరాటాన్ని పట్టించుకున్నట్టు లేదు. ఇక గోపాలమే తన ఆత్రుతను బయటపెట్టాడు.

"ఫిమేల్ వార్డులో ఎంతోసేపు ఉండనివ్వరు. విజిటింగ్ వేళలు కనుక్కుని తీసుకువెళ్తాను" అంది కోడలు ఇంగ్లీషులో. ఏదో ఆఫీసు పనిలో తీరికలేని కారణంగా బాగా ఆలస్యంగా ఇంటికి వచ్చింది. మర్నాడు సాయంత్రం కొడుకు బాల్కనీలో విశ్రాంతి తీసుకొంటున్నప్పుడు "రఘూ ! అమ్మని నేను చూడాలి" అన్నాడు గోపాలం.

ఏదో గుర్తొచ్చినట్లు "అమ్మ కూడా మీ గురించే అడిగింది. డాక్టర్లకి అమ్మ నరాల బలహీనత అంతు చిక్కని సమస్యగానే ఉంది. ఐ.సి.యు. వార్డుకి తరలిస్తున్నారు. రేపు ఉదయాన్నే మీరూ, నేనూ వెళ్ళి చూద్దాం" రఘు తాజా వార్తగా చెప్పాడు.

అయోమయంగా చూస్తున్న తండ్రికి ఇంకాస్త వివరంగా చెప్పాలని ప్రయత్నించాడు. "ఇప్పటి నరాల బలహీనత కేన్సర్ వల్ల కాదంటున్నారు. మెదడు పొరల్లో ఏదో వైరస్ ఆక్రమించిందనీ, దానికి మందిచ్చి తీసివేస్తే ఎప్పటిలా అమ్మకి శక్తి వచ్చేస్తుందనీ అంటున్నారు ......" అన్నాడు. ఈ సమాచారం కాస్త ఉపశాంతిని కల్గించినా, ఎప్పుడు తెల్లవారుతుందా అన్న ఆత్రంతో రాత్రి నిద్ర పట్టలేదు. వేగం లేచి కొడుకు పిలుపు కోసం సిద్ధంగా కూర్చున్నాడు. కొడుకు నిదానంగా ఉండడంతో కోపం కూడా వచ్చేసింది. రఘు తండ్రి ఆరాటాన్ని అర్థం చేసుకొని "నాకు తెలిసిన సర్జన్‌కు ఫోన్ చేశాను. ఉదయం రోగులకు మొహాలు కడిగించడం, పక్కబట్టలు మార్చడం, వార్డు శుభ్రం చెయ్యడం, స్పెషలిస్టుల రౌండ్స్, నర్సుల డ్యూటీలు మారడంతో చెప్పలేని రద్దీ ఉంటుంది. తొమ్మిదిన్నర దాటితే మీరు కాస్త స్థిమితంగా అమ్మతో మాట్లాడవచ్చు" వివరణ ఇచ్చాడు.

ఎర్రదీపాల దగ్గర ఆగుతూ, సాగుతూ పోతున్న కారులో అశాంతిగా చేతి వాచీని చూసుకొంటున్న గోపాలం ఒక్క కుదుపుతో కారు ఆగగానే, ఆ ప్రయాణానికి ఒక

గంట సుమారుగా పట్టిందనుకున్నాడు. ఎత్తైన పెద్ద ద్వారం, గేటూ దాటి కారు విశాలమైన ఆవరణలోకి దూసుకుపోయి ఆగింది. అంత పెద్ద ఆసుపత్రిలోకి వెళ్ళవలసిన అగత్యం గోపాలానికి ఎన్నడూ రాలేదు ఆనాటి వరకూ. పద్మవ్యూహం లాంటి భవనంలో రఘు వెంట నీడలా అనుసరించాడు. మెట్లెక్కి న్యూరో (మెడికల్) ఐ.సి.యు. అన్న అక్షరాలున్న అద్దాల తలుపు దగ్గర తండ్రిని నిలిపి ''ఇక్కడే ఉండండి. ఇప్పుడే సర్జన్‌ని కలిసి వస్తాను'' అంటూ రఘు ఎక్కడికో వెళ్ళాడు. ఎదురుగా ఉన్న ఆపరేషన్ థియేటర్ ద్వారానికి ప్రక్కనే ఇద్దరు తలపాగాల గ్రామస్థులు కూర్చుని ఉన్నారు. ఆ ముఖాల్లో ఏదో ఆందోళన, వర్ణించలేని దైన్యం. వాళ్ళ ఆత్మీయులెవరికో ఆపరేషన్ జరుగుతున్నదేమో అనుకున్నాడు. దుఖ్ దర్ద్‌సె జగమే కోయీ ఆజాద్ నహీ ....... అన్న ఏనాటిదో పాట గుర్తొచ్చింది.

'పదండి' అని కంఠం వినిపించేదాకా రఘు వచ్చిన స్పృహలేనే లేదు గోపాలానికి.

చల్లగా ఉన్న వార్డులోకి అడుగుపెట్టగానే రఘు అక్కడ స్టెయిన్‌లెస్ డబ్బాలోంచి శుద్ధిచేసి ఉంచిన పాదాల తొడుగులు తీసి, బూట్లకు తొడిగి 'తండ్రి కాళ్ళ వేపు చూశాడు. వేసుకున్న చెప్పులు అక్కడే విడిచి పెట్టి రావచ్చునని చెప్పి, రెండో నెంబర్ క్యూబికల్‌లోకి వెళ్ళమని చూపించి, వార్డు మధ్యనే వేదికమీద ఉన్న డ్యూటీ డాక్టర్‌ని కలవడానికి వెళ్ళాడు. ఆ వేదిక చుట్టూ అద్దాల గోడలతో చిన్న చిన్న క్యూబికల్స్ (గదులు) ఉన్నాయి. గదుల్లో ఉన్న రోగుల్ని ఆ వేదిక మీంది చూసేలా నిర్మించిన వేదిక అది.

నిశ్శబ్దంగా గదిలోకి అడుగుపెడుతూ వుంటే ఎదురుగా ఉన్న మోనిటర్ తెరమీద ఆకుపచ్చని గీతలు కీచురాళ్ళలా చిన్న చిన్న శబ్దాలు చేస్తున్నాయి. కళ్ళు తెరచి శూన్యంలోకి చూస్తున్న కోమలి తల దగ్గరగా వెళ్ళి చూడగానే ఆమె దృష్టి గోపాలం మీదకు మళ్ళింది. దుఃఖం ముంచుకొచ్చింది. "నన్ను ఇక్కడ పడేసి మరచిపోయారా' అని ఏడ్చింది. ఏమి చెప్పాలో, ఎలా సముదాయించాలో అర్థం కాలేదు. తలమీద అరచేతినుంచి నెమ్మదిగా ఓదార్చాడు. "ఇది నా ఊరూ, నేనెరిగిన ప్రపంచం కాదాయె. పిల్లల మీద ఆధారపడి వాళ్ళ వీలుబట్టి రావలసి వచ్చింది" అని వివరించాడు.

''ఒళ్ళంతా పోట్లు పొడిచినట్లు నొప్పి. రాత్రి నిద్ర రాదు. అసలు ఏది రాత్రో, ఏది పగలో తెలియని లోకం ఇది. కీ-కీ అని వచ్చే సన్నని శబ్దాలు వింటూ నాలో నేనే మాట్లాడుకోవడం, ఓదార్చుకోవడం. నా అన్న వాళ్ళు కనపడని ఒంటరితనం. నర్సులు మాట్లాడేది హిందీ - ఇంగ్లీషు'' తన బాధని ఆయాసపడుతూ చెప్పుకొంది. అపరాధిలా నిలబడి విన్నాడు గోపాలం. ''ఆ కాళ్ళు అలా ఎంతసేపయి ఉండిపోయాయో. కాస్త కదిపి మార్చుకుందామంటే నాకు వీలు కావడం లేదు'' అనగానే మోకాళ్ళు నెమ్మదిగా పైకి లేపి చిన్న దిండ్లు అడుగున పెట్టి, చేత్తో గట్టిగా కాళ్ళు పట్టి కొంత వెసులుబాటు కలిగించాడు. కాస్త ఉపశమనం పొందిన కోమలి ''మీరెలా ఇప్పుడు ఒక్కరే రాగలిగారు ?'' అని అడిగింది. భార్య పూర్తిగా స్పృహలో ఉంది అన్న నమ్మకం కలిగింది ఈ ప్రశ్నతో.

''నేను రఘునడిగి, వాడితో వచ్చాను. వాడు డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి వస్తానన్నాడు. ధైర్యంగా ఉండు. ఆసుపత్రి పేరూ, ఎక్కడ ఉన్నదీ తెలిసింది కదా. ఇక కొండగుర్తులు చూసుకొంటూ రోజూ ఆటోల్లో వస్తాను. వాళ్ళ ఆఫీసు ఒత్తిళ్ళు వాళ్ళవి'' అంటూ వుంటే ఒక సిస్టర్ గదిలోకి వచ్చింది. ఎవరు మీరన్నట్టు గోపాలం వేపు చూసింది. స్టాండ్‌లో తిరగబడి ఉన్న సీసాలోని ద్రవంలోకి ఏదో సూదితో మందు ఎక్కించి మేజా మీద ఉన్న చార్ట్‌లో ఒక ఎంట్రీ వేసింది. ప్రక్కనే ఉన్న క్యూబికల్‌లోకి వెళ్ళిపోయింది. ఇంకో సిస్టరు వచ్చి కోమలి కడుపు దగ్గర సూది పెట్టి గుచ్చి పరీక్షకి రక్తాన్ని తీసుకొంది. అది చూస్తూ నిలబడ్డ గోపాలం విలవిలలాడాడు. ఇంతలో రఘు వచ్చి తల్లిని పలకరించి ''ఇక మనం వెళ్ళిపోదాం, పదండి మళ్ళీ రేపు తీసుకొస్తాను'' అన్నాడు. ఆ మాట తనని తృప్తి పరచడానికే అంటున్నాడు కానీ, ఎప్పుడు మళ్ళా తీరుతుందో వాడికే తెలియదు - అని మనసులో గోపాలం అనుకుంటూ ఏదో నిశ్చయానికొచ్చాడు. కోమలి మొహంలోకి మరోమారు చూసి ధైర్యంగా ఉండమని చెప్పి వార్డు బయటకు వచ్చాడు.

''ఇంత పెద్ద హాస్పిటల్ కదా. ఇన్ని సదుపాయాలున్నాయి. రోగుల్ని దూరప్రాంతాల నుండి తెచ్చిన బంధువులు ఉండడానికి గదులూ డార్మిటరీలూ ఉండవూ ? నేను ఇక్కడే ఉంటే ఏ మాత్రం అవకాశం ఉన్నా, పోయి అమ్మను పలకరిస్తే ఒంటరిని అన్న నిస్పృహ ఉండదు'' అని అడిగాడు.

“అలాగే నేను కనుక్కుంటాను గానీ, నాకు ఆఫీసు పని ఉంది పదండి” తొందర చేశాడు రఘు.

❊ ❊ ❊

‘ఎవరి చేతిలోనైనా మోయలేని బరువుంటే కాస్తసేపు నాకివ్వమని అందుకోగలం. కానీ ఒకరి ఒంట్లో బాధను అలా అందుకోలేకపోవడం ఈ ప్రకృతి విధించిన కఠోర నిర్ణయమేమో’ అన్న ఆలోచనతో వేకువనే నిద్ర లేచిన గోపాలం తొందరగా స్నానం ముగించాడు. ఏదో ఆఫీసు పని ఉందని రఘు వెళ్ళిపోయినట్లు కోడలు చెప్పింది. నేనూ ఆసుపత్రికి వెళ్తున్నానన్నాడు. “ఒక్కరే ఎలా వెళ్తారు. సాయంత్రం మీ అబ్బాయి తీసుకెళతారు” అంది.

“హాస్పిటల్ పేరు తెల్సును. నోట్లో నాలుక ఉంది. ఆటోలో వెళ్తాను” దృఢంగా అన్నాడు. అయితే సరే అన్నట్లు క్షణం మౌనంగా ఉన్న కోడలు - తడి గుడ్డతో ఇల్లు తుడుస్తున్న దీదీని పిలిచి “ఆజ్ దాదాజీ ఘర్‌మే నహీ రహేంగే. చోటూకే స్కూల్ కీ చుట్టీ హై. తుమ్ దేఖ్‌తే రహనా .... ” అని హడావిడిగా ఆఫీసుకు వెళ్ళిపోయింది.

ఆటోవాడు అనవసరంగా నగరమంతా తిప్పి కాలయాపన చేస్తాడేమో అన్న ఆందోళనతో క్రిందటి రోజు చూసిన కొండగుర్తులు కొన్ని జ్ఞాపకం తెచ్చుకొంటూ గంటన్నర తర్వాత హాస్పిటల్ చేరుకున్నాడు గోపాలం.

మెట్లెక్కి వగరుస్తూ ఐ.సి.యు. వార్డు చేరుకున్నాడు. తన అదృష్టం కొద్దీ అప్పుడే బయటకు వస్తున్న సిస్టర్‌ని నిలిపి తన భార్య - కోమలిని చూడలన్న కోరిక ఇంగ్లీషులో చెప్పి ప్రాధేయపడ్డాడు. విసవిసలాడకుండా “ఇప్పుడే స్పెషలిస్టుల రౌండ్స్ అయినాయి. లోపలికి వెళ్ళి కుడిచేతి వేపు రెండో క్యూబికల్ ........” అని ఎంతో ప్రసన్నంగా జవాబిచ్చిన ఆ అమ్మాయి దేవతలా కనిపించింది.

క్యూబికల్‌లోకి అడుగుపెడుతూ చూసిన దృశ్యం తన ఊహకందనిదిగా తోచింది. నీలిరంగు గౌనులో ఉన్న సిస్టరు, కోడమలి మొహం మీద మొహం ఉంచి వింతగా వినిపించే యాసతో తెలుగులో మాట్లాడుతోంది. కోమలి సన్నగా ఏదో పాడి వినిపిస్తోంది. వారికి ఇంకొకరి ధ్యాస ఆ క్షణంలో లేదు. “ఆంటీ ! నా

డ్యూటీ అయి చాలా సేపయింది. మీతో ఉంటే టైమే తెలియ'దని చేతి వాచీ చూసుకుని హడావిడిగా వెళ్ళిపోతున్న ఆమెకు, తాను ప్రక్కకు జరిగి దారి ఇచ్చేడు. ఆమె ఛాతిమీద 'అనితా డే' అన్న పేరు స్పష్టంగా కనిపించింది.

కోమలికి దగ్గరగా వెళ్ళేడు గోపాలం. "ఆ అమ్మాయి పేరు చూస్తే బెంగాలీ, నీకెలా పరిచయం?" అని ఆనందం, ఆశ్చర్యం కలగలపి అడిగాడు.

"రాత్రి నొప్పి - నొప్పి అని మూలిగట్టున్నాను. ఆంటీ ! మీరు తెలుగువారా? అని మాట కలిపింది. మీరు పాడే పాటే చిన్నగా నేను కూనిరాగం తీస్తూ పాడితే విని ఈ పాట మీకెక్కడిదీ - చాలా పాత పాట మా తాతగారికీ పాట ఎంతో ఇష్టం అంటూ చెప్పింది. చాలా కలుపుగోలు మనిషి. వాళ్ళ తాతగారు విశాఖలో సింధియా కంపెనీలో పని చేశారట. చిన్నతనంలో అక్కడే చదువుకుందట" కోమలి పెదవులు నాలుకతో తడిచేసుకొంటూ, ఆయాసపడుతూ ఉత్సాహంగా చెప్పింది. తొలిరోజు లేని ఆనందం, వెలుగూ ఆ మొహంలో చూసిన గోపాలం ఆశ్చర్యపోయాడు. ఒంటరిగా ఉన్న రోగికి ప్రేమగా పలుకరించే వాళ్ళు దొరికితే ఎంత మార్పు వస్తుందో ఊహించగలిగాడు.

ఇంతలో ఇంకో సిస్టర్ వచ్చి మేజా మీద చార్ట్ వేసి, స్టాండ్‌లో తిరగబడిన సీసాల్లోని ద్రవాన్ని చూసి, వెళ్ళిపోతూ గోపాలం వేపు చూసింది. "మీ భార్య ఎంత చెప్పినా సరిగ్గా ఆహారం మోతాదులో తీసుకోవడం లేదు. ఇక అలాగే ఉంటే ముక్కు లోంచి పైప్ పెట్టి ద్రవాహారం ఇవ్వాల్సి ఉంటుందని మీరే చెప్పండి" అని ఇంగ్లీషులో చెప్పి వెళ్ళిపోబోతోంది.

ఇదే అవకాశం అని ఆమెను నిలిపి తన సందేహాన్ని బయటపెట్టాడు. "మేమెవ్వరమూ రాత్రి రోగి సాయంగా ఉండకూడదా ?" చదువుకున్న వాడికి నిజానికి ఇటువంటి సందేహం రాకూడదు. ఆ పరిస్థితిలో చోటుచేసుకున్న బేలతనం అది. అందుకేనేమో ఆమె నవ్వింది. "ఈ వార్డులో రాత్రే కాదు ఎప్పుడూ ఉండనివ్వరు. డ్యూటీలో ఉన్న ఆఫీసర్ అభ్యంతరం చెప్పకపోతే కొంతసేపు ఆత్మీయులు వచ్చి పోతూ ఉంటారు. ఆయన ఏ కారణం చేతనైనా అభ్యంతరం చెప్తే మేం చెయ్య గలిగిందేమీలేదు ...." ప్రసన్నంగా బోధపరచింది. "కొందరు వెర్రిఅభిమానంతో

వచ్చే రోగికి విశ్రాంతి లేకుండా, ఏవేవో ఆహారంగా పెట్టడం కారణంగా కఠినంగా ఉండవలసి వస్తుంది'' అని వివరణ ఇచ్చింది.

తనంత తానుగా ఆటోలో తనకు ఏ పరిచయమూ లేని ఢిల్లీ మార్గాల్లోంచి రాగలగడమూ, కోమలి దగ్గర తెలుగు మాట్లాడే ఒక అమ్మాయి ఉంటోందన్న భావనా గోపాలంలోని ఆరాటాన్ని కొంత తగ్గించింది. అనితా డే కూడా 'అంకుల్ - అంకుల్ అని సంబోధిస్తూ పలుకరించినప్పుడు కొండంత ధైర్యం కలిగింది. అయితే ఈ తృప్తి కేవలం నాలుగు దినాలకే పరిమితమై పోతుందని ఊహించలేకపోయాడు. ఒక రాత్రి రఘుకి వచ్చిన టెలిఫోన్ కాల్ అందరినీ కలవరపరిచింది.

అప్పటివరకూ జరిపిన పరీక్షల్లో తప్పించుకొంటూ దొరకని కేన్సర్ కణం వెన్నుపూసలోంచి తీసి చేసిన ద్రవపరీక్షలో పట్టుబడింది. కాన్సర్ మెదడును పూర్తిగా వశపరచుకున్న కారణంగానే నరాల శక్తి సడలిందనీ, వైరస్ వల్ల బలహీనత రాలేదనీ డాక్టర్లు నిర్ధారించాక ఇక చేయగలిగింది లేదనీ, ఫ్యామిలీ వార్డుకు తరలించి, అక్కడి నుండి ఇంటికి విడిచిపెడతారనీ తెలిసింది. ఉదయం పదకొండు గంటలకు రఘు కారులో వెళ్తాడని విన్న గోపాలం అంతవరకూ ఆగలేక వేకువనే ఆటోలో ఫ్యామిలీ వార్డు చేరుకుని కోమలి మంచం దగ్గర నిలుచున్నాడు. గాఢ నిద్రావస్థలో ఉంది. అదే గదిలో మరి ముగ్గురు రోగులూ, వారి ఆత్మీయులూ ఉన్నారు. అంత గాఢ నిద్రలోంచి మేలుకొలుపే సాహసం లేక నిస్సహాయంగా చూస్తూ గడిపాడు. మెట్లెక్కి ఐ.సి.యు. వార్డులోకి వెళ్ళి, అక్కడ ఎవరైనా కాసింత పరిచయమైన నర్సులు ఉంటారనీ, ఏదైనా అడగాలనీ తొంగి చూశాడు. ఎవ్వరూ కంటపడలేదు. తిరిగి కోమలి వద్దకు వచ్చేసరికి ఆమె ఊపిరిని చప్పుడు చేస్తూ భారంగా తీసుకుంటోంది. అలా కోమాలోకి జారుతున్న సమయంలో రఘూ, కోడలూ కూడా వచ్చారు.

అద్దాల కిటికీలోంచి ఎదురుగా ఉన్న రావిచెట్టునే చూస్తున్న గోపాలానికి ఇక వార్డులో యాంత్రికంగా జరిగిపోతున్నదేమీ కంటికి ఆనడం లేదు. పంజరం మిగిలి, ప్రాణం ఎగిరిపోయిందనుకున్నాడు. గాలి వాటున రావి ఆకులు రాలుస్తున్న చెట్టునే చూస్తున్నాడు. భరించరాని బాధను కోమలి అనుభవిస్తూ ఇంకా అలా బతుకును కొనసాగించాలని గోపాలం కోరుకోలేదు. కానీ, ఒకే అసంతృప్తి ఎదలో ముల్లులా

మిగిలిపోయింది. తనవారెవరూ దరిదాపుల్లో లేకుండానే ఒంటరిని అన్న నిస్పృహతో నిద్రలోకి, కోమాలోకీ జారిపోవడం తట్టుకోలేకపోయాడు. నిర్దయగా విడిచిపెట్టే శారనుకుని ఉంటుంది. ఆ ఒక్క అపరాధభావం అతన్ని క్రుంగదీసింది. కావలసిన వాళ్ళెవరైనా రైల్లో ప్రయాణం చేస్తూ ఉంటే, రైలు పెట్టె కదలిపోయేదాకా దానితో పాటు అడుగులు మెల్లగా వేస్తూ కిటికీలోని ప్రయాణీకుడికి చేతులు ఊపుతూ, ఆప్యాయతలు అందించే దృశ్యాలు జీవితంలో చూశాడు. తిరిగిరాని ఈ ప్రయాణంలో కోమలి వద్ద ఎవ్వరూ లేరన్న బాధతో కళ్ళు తుడుచుకున్నాడు.

తన మనసులోని కోరికను కొడుకు ముందుంచి, యాగీ చేసి అయినా ఆసుపత్రిలోని డార్మిటరీలో ఉండిఉంటే ఏ మాత్రం అవకాశం దొరికినా కోమలికి ధైర్యం చెప్పి కనుసన్నల్లో ఉండేవాడు. డ్యూటీలో ఉన్న డాక్టర్లు కూడా తన పట్ల సానుభూతితో, సహనంతో వ్యవహరించారే కానీ, అభ్యంతరం చెప్పలేదు ఎప్పుడూ కూడా.

❊ ❊ ❊

శ్రమపడి కట్టుకుని భార్యతో గడిపిన ఇంట్లో గోపాలం ఒంటరిగా ఉండడానికి పిల్లలూ, బంధువులూ సమ్మతించలేదు. రఘుతోనే ఉంటూ కాలమిచ్చిన మార్పును తాత్త్వికంగానే స్వీకరించాడు. ఎప్పుడైనా కొడుకూ, కోడలితో కలిసి అదే హాస్పిటల్ రోడ్డుమీంచి ఎక్కడికైనా వెళ్ళవలసి వస్తే నిద్రాణంగా మనసులో ఉన్న అశాంతి మేల్కొంటుంది. తలను బరువుగా ఇంకోదిశగా తిప్పేసుకుంటాడు. ఏళ్ళు గడచి పోతున్నాయి.

ఒక సాయంత్రం ఇండియాగేట్ దగ్గర పచ్చని గడ్డిమీద నిలిచి మనవడు పేరాషూట్ (ఆడుకునేది) గాలిలోకి ఎగరవేసి ఆడుతూ ఉంటే చూస్తున్నాడు గోపాలం. "మీరు మనవడితో ఆడుతూ వుండండి. మేమిప్పుడే వచ్చేస్తాం' అని కొడుకూ, కోడలూ ఎవరినో కలవడానికి వెళ్ళారు.

"ఓ అంకుల్ ! హౌ ఆర్యూ ? మీరు బావున్నారా ?" అన్న శ్రావ్యమైన గొంతు విని చూశాడు. పలకరించిన అమ్మాయి తనకు పరిచయమైనట్టే ఉన్నా, గుర్తు రాక తికమకపడిపోతున్నాడు.

"నేనంకుల్ ! అనితాడేని" అని కంఠం పెంచి గుర్తు చేసింది.

"నిన్ను హాస్పిటల్ దుస్తుల్లోనే చూశాను. ఈ బెంగాలీ చీర కట్టులో గుర్తించడం కష్టమే మరి ....' అన్నాడు, ఆమె చంకలోని పిల్లను చూస్తూ .......... అతని గొంతు గాద్గదికమైపోయింది. కంటిలో చెమ్మ. ఏదో దూరతీరాలనుంచి వచ్చిన రాయబారిలా కనిపించింది అనితా డే. వాలుకళ్ళు మిటకరిస్తున్న చంటి పాప తనవేపు అందంగా, అమాయకంగా చూస్తోంది. ఆ పాప బుగ్గలు చిదిమి 'ఏం పేరు' అని అడిగాడు.

"కోమలి" అంది అనిత.

"నాలాంటి ముసలివాడితో పరిహాసమా ?" అన్నాడు.

"నో - నో. ఎంతమాట ? మీతోనా ? నిజంగానే కోమలి అని పేరు పెట్టుకున్నాను.

విని అర్థం కానట్టు వెర్రిగా చూశాడు.

"ఆంటీతో పరిచయమైన తర్వాత నా నీడ పడితే చాలు పేరు పెట్టి మెల్లగా పిలిచేది. తెలుగులో మాట్లాడే సిస్టర్ని నేనే. ఆమె నొప్పి నొప్పి అంటే ఆ బాధను మరిపించడానికి డాక్టర్ మందు మోతాదు పెంచారు. ఒక్కొక్కసారి దాని కారణంగా ఎక్కువ మాట్లాడుతారు. ఆ రోజు నిద్రలోకి జారిపోయే ముందు నేనే డ్యూటీలో ఉన్నాను. ఆంటీ మాట్లాడుతూనే గడిపింది".

గోపాలానికి ఈ వార్త కొంత ఉపశమనం కల్గించింది. చాలా రోజులై మోస్తున్న బరువు కరిగినట్లయింది. ఏమి మాట్లాడిందని అడిగాడు ఆత్రంగా.

"ఆమె మాటలన్నీ మీ గురించే. ఆమె బెంగంతా మీ గురించే. మీకు పాట లంటే ఇష్టమట. హిందీ పాటలు కూడా ఎక్కువ ఇష్టమట. ఆమె నేర్చుకున్న హిందీపాట అంత బాధలోనూ పాడింది చిన్నగా. ఆ పాట నిజానికి ఇంతవరకూ జ్ఞాపకం ఉండడానికి ఇంకో కారణం కూడా ఉంది. మా తాతగారికి అదే పాట ఎంతో ఇష్టం. ఆ పాట పాడిన గాయకుడు కూడా మా తాతగారికి తెలుసునట".

"ఏ పాట .... ? గుర్తుంటే చెప్పు"

అనిత పల్లవిని వినిపించింది. "ఏన బతాసకూంగమై; దిలో కోహై తుమ్ సె ప్యార్ క్యూం ......"

"పోనీలే ఆఖరి క్షణంలో ఒంటరినన్న నిస్పృహ లేకుండా నీతో గడపడం దైవికమేమో. ఇంతకీ నీ పాపకు ఆంటీ పేరు ఎందుకు పెట్టినట్టు ?"

"నేను ఆంటీతో మాట్లాడుతూ ఉంటే నా తోటి డ్యూటీ చేస్తున్న వర్గీస్ 'అనితా నీ శలవు ఎప్పటినుండీ ? అని అడిగింది. 'రేపటి నుండే' అని నేను చెప్పక తప్పలేదు. 'పెళ్ళికా' అని అడిగింది ఆంటీ. నిజంగానే పెళ్ళికి శలవు పెట్టాను. రెండు నెలల క్రితమే నా పెళ్ళి నిశ్చయమైంది అన్నాను. ఆంటీ అది విని 'నువ్వు మంచి పిల్లవు. నీకు మంచి భర్త దొరకుతాడు. నీకు కొడుకు పుడితే అంకుల్ పేరు పెట్టుకో' అంది. అలా పావుగంట ఏదో మాట్లాడుతూ నిద్రలోకి జారుకుంది. మర్నాడు నేను శలవులో వెళ్ళిపోయాను. ఆంటీని ఫ్యామిలీ వార్డుకు తరలిస్తున్నట్టు నాకు తెలుసు"

"మరి నీ పాపకు ఆంటీ పేరు ఎందుకు ? అంటూ సందేహంలో ఆగిపోయాడు గోపాలం. చిన్నగా నవ్వింది అనిత. నాకు అబ్బాయి పుట్టలేదు. అమ్మాయి కలిగింది. నాకు ఆంటీ పేరు పెట్టాలని ఎందుకో అనిపించింది. మావారు కానీ, ఇంట్లో పెద్దలు కానీ అభ్యంతరం చెప్పలేదు ......" ముగించి అనితా డే ఒక్కక్షణం కళ్ళు రెండూ మూసుకుంది.

గోపాలం గాఢంగా నిట్టూర్చాడు. 'ఇలా కూడా పేరు పెట్టుకుంటారా ? చిత్రమే ఈ మనుషులూ, ఈ మమతానుబంధాలు సులభంగా అర్థంకావు. ఇవి లేని జీవితం ...... అనుకుంటూ వుండగానే చేతి వాచీని చూసిన అనిత తొందరపడుతూ శలవు తీసుకు వెళ్ళిపోయింది.

కనుమరుగయ్యేదాకా ఆమెనే చూస్తూ శిలలా నిలిచిపోయాడు. గాలికి రాలిపడే రావి ఆకులా మనసు తేలికపడింది.

✣ ✣ ✣

ఆంధ్రప్రదేశ్ పత్రిక

✣ ✣ ✣